ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
https: epaper.
prabhathasamacharam.com
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ గురువారం । 19 మార్చి 2026 । ■ 12 పేజీలు

ప్రభాత సమాచారం



అకాల వర్షం
## దెబ్బతిన్న పంటలు

11లో



# ఉషస్సుల ఉగాది.. నవ్యతకు నాంది



■ నేడు 'పరాభవ' సంవత్సర ఉగాది పర్వదినం ■ భక్తులతో కిటకిటలాడనున్న ఆలయాలు
■ ప్రత్యేక పూజలు ■ పంచాంగ శ్రవణం చేయనున్న పండితులు

కష్టసుఖాల కలయికలతో తీపి, చేదు జ్ఞాపకాల విశ్వావసునామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. వనాలన్నీ చిగురించి, పూల పరిమళాలు వెదజల్లే వేళ.. కోయిలమ్మల కుహుకుహూ రాగాలు.. హాయినిచ్చే వెచ్చని గాలులు.. వెలుగులు పంచే విశ్వావసునామ తెలుగు సంవత్సరానికి తెలుగు ప్రజలు గురువారం ఘనస్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. వసంత రుతువు ఆగమనంతో చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయం నుంచి తెలుగు నూతన సంవత్సర ఉగాది జరుపుకోవడం ఆనవాయితీ. ఉగాది అంటే కష్టసుఖాల కలయిక. షడ్రుచుల వేడుక. నూతన వస్త్రధారణ, ఆలయాల సందర్శనం, ఇష్టదైవాల ఆరాధనతో పాటు.. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, పిండి వంటల తయారీ పండుగ ప్రత్యేకం. నేడు పరాభవనామ ఉగాది పర్వదినం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రముఖ పంచాంగ పండితులు, కవులు, అలనాటి పండుగ వేడుకలు, మారిన కాలంలో ఉగాది ఉషస్సులు, పలు ఆలయాల్లో ప్రత్యేకతలతో కథనం.





2

## గంజాయి రహిత సమాజమే లక్ష్యం

■ సాగు చేస్తే సామాజిక పథకాలు కట్ ■ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్
■ డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని సర్పంచులు, కౌన్సిలర్లకు పిలుపు ■ రంగంలోకి ఈగల్ ఫోర్స్
■ గంజాయి విక్రేతలకు 10 ఏళ్ల జైలు శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక
■ యువత భవిష్యత్ చిన్నాభిన్నం కావొద్దు ■ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### కన్నపేగు కఠినత్వం

జాతీయ రహదారిపై
పసికందు మృతదేహం..
గుడిహత్నూరు కలకలం





పీఎంశ్రీ పాఠశాలలను
### ఆదర్శంగా తీర్చిదిద్దాలి

కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమిత్
కుమ్రంభీం జిల్లాలో సమీక్షా సమావేశం






# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

**సాగు చేస్తే సామాజిక పథకాలు కట్ - ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక**
**యువత భవిష్యత్ చిన్నాభిన్నం కావొద్దు - డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని సర్పంచులు, కౌన్సిలర్లకు పిలుపు.**
**రంగంలోకి 'ఈగల్ ఫోర్స్' - గంజాయి విక్రేతలకు 10 ఏళ్ల జైలు శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక**
**నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచన - 25 బాల్య వివాహాలను అడ్డుకున్న షీ టీమ్స్.**
**రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్' హెల్మెట్ ధరించడం ప్రాణరక్ష అని స్పష్టం చేసిన పోలీస్ యంత్రాంగం**









**ఆదిలాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తమ పరిధిలోని గ్రామాలను, వార్డులను గంజాయి రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రత, మహిళల భద్రత, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్ ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు 'మూడవ కన్ను'లా పని చేస్తాయని, ప్రతి ఒక్కరూ వీటి ఏర్పాటుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సర్పంచులు, కౌన్సిలర్లు తమ పరిధిలోని గ్రామాలను, వార్డులను గంజాయి రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగు చేసే రైతులపై కఠిన చర్యలు ఉంటాయని, ఇప్పటికే కొంతమంది రైతుల వివరాలను అగ్రికల్చర్ కమిషనర్‌కు పంపి వారి రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలను నిలిపివేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాల పై తీర్మానం చేయాలని కోరారు. ప్రతి గురువారం 'ఆరోగ్య పాఠశాల'లో భాగంగా విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ డే నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

**సమిష్టి బాధ్యతతోనే గంజాయి నిర్మూలన : ఎస్పీ అఖిల్ మహాజన్**
గంజాయి సాగు,విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణను డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చడంలో భాగంగా పోలీస్ శాఖలో ప్రత్యేకంగా 'ఈగల్ ఫోర్స్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి సాగు చేస్తే 10 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. యువత గంజాయికి అలవాటు పడితే వారి జీవితాలతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కోసం రిమ్స్, డవ్ సెంటర్లలో కౌన్సిలింగ్, డీ-అడిక్షన్ సౌకర్యాలు కల్పిస్తున్నామని, సర్పంచులు బాధితుల జాబితా ఇస్తే వారిని మార్చడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు భద్రత లో భాగంగా'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్పీ సూచించారు. మహిళా భద్రత కోసం జిల్లాలో చైల్డ్ మ్యారేజెస్ (బాల్య వివాహాలు) అరికట్టడానికి పోలీసు అక్క, షీ టీమ్స్ నిరంతరం కృషి చేస్తున్నాయని, గత మూడు నెలల్లో 25 బాల్య వివాహాలను అడ్డుకున్నామని తెలిపారు. కల్లులో అల్ప్రాజోలం వంటి రసాయనాలు కలపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందని, అటువంటి వారిపై నిఘా ఉంచాలని కోరారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదక ద్రవ్యాల (గంజాయి) నిర్మూలనకు కృషి చేసి ఆరోగ్య వంతమైన సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరం పాటుపడదాం అని కార్యక్రమానికి హాజరైన వారందరితో కలిసి కలెక్టర్, ఎస్పీ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.సీతారాం, అదనపు ఎస్పీ పి.కృష్ణ మూర్తి, సిఐ పి.ప్రకాష్ రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీలు బి.సురేందర్ రావు, పి.మౌనిక, ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర రావు, విజేందర్, పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్ పాల్గొన్నారు.



## ఇంటి ముందే యువకుడిపై
# అడవి పంది దాడి

**ఉట్నూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
ఇంటి ముందు నిలబడి ఉన్న సమయంలో అడవి పంది పంట పొలాల నుంచి ఒక్కసారిగా వచ్చి యువకుడి పై దాడి చేసిన ఘటన గురువారం మండలంలోని హస్నాపూర్‌లో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ ప్రవీణ్ అనే యువకుడు తన ఇంటి ముందు నిలబడి ఉన్నాడు. అకస్మాత్తుగా పంట పొలాల నుంచి ఓ అడవి పంది పరుగులు తీసుకుంటూ ఆ యువకుడి పై విచక్షణ రహితంగా దాడి చేసింది. ఆ యువకుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడికి వచ్చారు. దాడి చేసి అడవి పంది పరార్ అయింది. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్ ను వెంటనే ఆటోలో ఆస్పత్రికి తరలించారు. జనావాసాల్లోకి వచ్చి అడవి పంది దాడి చేయడంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జనావాసాల్లోకి రాకుండా అటవీ శాఖ అధికారుల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# డొమెస్టిక్ సిలిండర్లు సీజ్

**బెల్లంపల్లి, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 16 డొమెస్టిక్ సిలిండలను సివిల్ సప్లై విభాగం రాష్ట్ర ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సీజ్ చేశారు. బజార్ ఏరియా, కాల్ టెక్స్ ఏరియాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, టీ కొట్లు, చికెన్ దుకాణాలపై ఆ విభాగం డిఎస్పి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# గ్రామంలో రోడ్డు వేయాలని గ్రామస్తులు ధర్నా

**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
తమ గ్రామానికి రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలోని గుండి గ్రామస్తులు రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. గ్రామానికి వెళ్ళి లింకేజీ రోడ్డు దయనీయంగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంకర తేలి పూర్తిగా గుంతల మాయమై రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో బురద కారణంగా వాహనాలు నడపడం ప్రాణసంకటంగా మారిందని వాపోయారు. గతంలో ఈ గుంతల్లో పడి అనేక మంది వాహనదారులు గాయాలపాలైనట్లు.. రోడ్డు నిర్మాణ విషయంలో పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరు



పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ముందు 'వైట్'.. వెనుక 'ఎల్లో' విద్యుత్ అధికారి కారు 'రంగుల' విన్యాసం!



**ఒకే కారు.. రెండు నెంబర్ ప్లేట్లు**
**నిబంధనలను నడిరోడ్డుపై ఖూనీ చేస్తున్న వైనం**
**సామాన్యుడికి ఒక చట్టం.. సాహెబ్‌కు మరో చట్టమా?**
**ఆర్టీఓ అధికారుల మౌనంపై విమర్శలు**
**తక్షణమే వాహనాన్ని సీజ్ చేయాలని డివిమాండ్**

**కాగజ్‌నగర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
చట్టం చుట్టాలకైనా సామాన్యుడికైనా ఒక్కటే అని ఊదరగొట్టే రవాణా శాఖాధికారులు ఈయూజర్ కారును చూసి ఎందుకు కళ్లు మూసుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో నిబంధనలను నడిరోడ్డుపై ఖూనీ చేస్తూ ఒక బాధ్యతాయుతమైన విద్యుత్ అధికారి చేస్తున్న విన్యాసాలు ఇప్పుడు స్థానికంగా సంచలనం రేపుతున్నాయి. పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద ప్రత్యక్షమైన ఆ కారును చూసి జనం ముక్కున వేలేసుకున్నారు. ఆ వాహనంపై గర్వంగా TSNPD-CL - ON GOVT DUTY అని రాసి ఉంది కానీ ఆ బోర్డు కింద ఉన్న నెంబర్ ప్లేట్లు మాత్రం రవాణా శాఖ చట్టాలను వెక్కిరిస్తున్నాయి. ముందు భాగంలో చూస్తే వైట్ నెంబర్ ప్లేట్ సొంత వాహనంకు ఉపయోగించేది. వెనుక భాగంలో చూస్తే ఎల్లో నెంబర్ ప్లేట్ కమర్షియల్ వాహనం వాడేది. TG20 6571 నెంబర్ గల ఒకే కారుకు రెండు రంగుల ప్లేట్లు తగిలించి, అటు ఆర్టీఓ అధికారులను ఇటు ట్రాఫిక్ పోలీసులను ఆ అధికారి బకరా చేస్తున్నట్లుగా ఉందని వాహనదారులు మండిపడుతున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానిక డ్రైవర్లు ప్రయాణికులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. సామాన్యుడు హెల్మెట్ పెట్టుకోకపోయినా నెంబర్ ప్లేట్ మీద అక్షరం వెలిసిపోయినా వందలు వేలల్లో చలాన్లు బాదే అధికారులు మరి ఈ ప్రభుత్వ అధికారి కారును ఎందుకు వదిలేశారు. మేము చేస్తే ఫైన్లు మీరు చేస్తే చట్టాలా..? నెంబర్ ప్లేట్ రంగులు మార్చడం.. తప్పుడు ప్లేట్లు వాడటం అనేది ఫోర్జరీ, క్రిమినల్ నేరం కిందకు వస్తుంది. ఒక ప్రభుత్వ అధికారి ఇంత బాహాటంగా చట్టాన్ని ఉల్లంఘిస్తుంటే రవాణా శాఖాధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ అయినా నిద్రపోతున్న రవాణ అధికారులు వెంటనే సదరు విద్యుత్ అధికారి వాడుతున్న ఈ రంగులు మార్చే వాహనాన్ని సీజ్ చేసి చట్టం ముందు అందరూ సమానమే అని నిరూపించుకోవాలి అని కోరుతున్నారు.

## షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు
# స్వయం ఉపాధి అవకాశాలు

**మంచిర్యాల, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని షెడ్యూల్ కులమునకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక పురోగతి పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా షెడ్యూల్డ్ కలముల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా రంగం ఎలక్ట్రికల్‌లో ఈ.వి. 2 వీలర్ ను 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం కల్పించి సగటు యూనిట్ ధర 1 లక్ష రూపాయలతో 185 యూనిట్లు, ఈ. వి. త్రిచక్ర వాహనం (సరుకు రవాణా/ప్రయాణికుల రవాణా)ను 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం కలిపించి సగటు యూనిట్ ధర 3 లక్షల రూపాయలతో 91 యూనిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ పథకాలలో సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగం ను 60 శాతం రాయితీ, 40 శాతం బ్యాంకు రుణం కల్పించి సగటు యూనిట్ ధర 3 లక్షల రూపాయల నుండి 7 లక్షల రూపాయల వరకు 19 యూనిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు, కుల ధ్రువీకరణ పత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత), ఆదాయ ధ్రువీకరణ పత్రం (మీ సేవ ద్వారా జారీ, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయలకు లోబడి), వ్యవసాయేతర పథకాలకు అభ్యర్థుల వయసు 21-50 సం.లు, వ్యవసాయ పథకాలకు 21-60 సం.లు ఉండాలని తెలిపారు. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ షెడ్యూల్డ్ కులాల పారిశ్రామికవేత్తలు/ గిగ్ వర్కర్లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంపు సెట్ కోసం కనీసం 2 ఎకరాల భూమి అవసరం), బోరు బావి, నీటి లభ్యతను నిర్ధారిస్తూ గ్రామ కార్యదర్శి నుండి ధ్రువీకరణ పత్రం సమర్పించాలని, సదరం సర్టిఫికెట్ (దివ్యాంగుల కొరకు), పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోగా ాదీవీమీ పోర్టల్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి





**ప్రస్తుత సమాజంలో మహిళలదే కీలకపాత్ర**

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో మహిళల పాత్రను కొనియాడుతూ, వారికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు అబలలు కాదని, సబలులుగా అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. విద్య ద్వారా మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ప్రతి మహిళ తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని పేర్కొన్న కలెక్టర్, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల అభివృద్ధికి పురుషుల సహకారం కూడా అవసరమని, సమాన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, విజయవంతమైన మహిళలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, పని ప్రదేశాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న విద్యార్థులు, ఉద్యోగులు తమ విజయగాథలను ఈ సందర్భంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఖజానా శాఖ అధికారి సరోజ, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలి



**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**మంచిర్యాల, మార్చి 18 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో 99 రోజుల కార్యాచరణ భాగంగా కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలోని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల వివరాలు తెలుసుకుని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. రాయితీ గ్యాస్ సిలిండర్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలు తీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 10వ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో త్రాగునీరు, వైద్య సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



**పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు**

# వాడకాన్ని వీడదాం - ప్రకృతిని కాపాడదాం

**పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నోడల్ అధికారి వీరేష్**

**'సేనోటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్'**

**ఎస్.ఆర్.కె.ఎం. కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు.**

**భూమి, నీరు, జీవ వ్యవస్థలకు పెను ప్రమాదం**

**ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై హెచ్చరిక**

**ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలి**

**మంచిర్యాల, మార్చి 18 (ప్రభాత సమాచారం)** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి "నో" చెప్పాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ సంస్థ సహాయ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి సిహెచ్.వీరేష్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్.కె.ఎం. డి. ఈడి. కళాశాలలో "సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని, భూమి, నీరు, జీవ వ్యవస్థలకు నష్టం కలుగుతుందని తెలిపారు. నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు పాటించవలసిన నియమాలు, ప్రత్యామ్నాయ మార్గాలపై వివరించారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, కరెస్పాండెంట్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



**సోషల్ మీడియాలో ప్రచారం**

# అవుతున్న వార్తలు అవాస్తవం

**ముథోల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులను పోలీసులు దూషించారనే సోషల్ మీడియా వార్తలను నిర్మల్ జిల్లా పోలీసులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. వైరల్ అవుతున్న వీడియోలోని వాయిస్ మార్ఫింగ్ చేసి, తప్పుదారి పట్టించేలా కావాలని రూపొందించబడిందని స్పష్టం చేశారు. విద్యార్థులు, ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, బాధ్యతాయుతంగా వ్యవహరించి, అసత్య ప్రచారాలను ప్రోత్సహించవద్దని కోరారు. మార్ఫింగ్ చేసిన వీడియోలను షేర్ చేయడం చట్టపరంగా శిక్షార్హమని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఈ-ఆఫీస్ వినియోగంతో ఫైళ్ళ పరిష్కారం వేగవంతం

**ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్**



**ఉట్నూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** ప్రజా పాలన-ప్రజా ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ – ఆఫీస్ వినియోగించడం ద్వారా ఫైళ్ళ పరిష్కారం వేగవంతం అవుతుందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటిడిఏలో ఈ-ఆఫీస్‌పై నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఈ – ఆఫీస్ ద్వారా కార్యాలయ ఫైళ్లను బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేగవంతమైన పరిష్కారం సాధించడం, వ్యవస్థలో బాధ్యతను పెంపొందించడం లక్ష్యంగా ఈ శిక్షణను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ-ఆఫీస్ అమలుతో కార్యాలయ పనితీరు మెరుగుపడటంతో పాటు ఫైళ్ల పరిష్కారం వేగవంతం అవుతుందని, అన్ని శాఖలు, విభాగాల అధికారులు, సిబ్బంది ఈ – ఆఫీస్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎ .పి.ఓ., ఎ. పి. ఓ. (పి వి టి జి) డి ఈ ఓ, టి. డబ్ల్యూ., జె. డి. ఎం., డి పి ఓ., పెసా సమన్వయకర్త, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నవోదయలో ప్రతిభచాటిన లిటిల్ హాన్స్ పాఠశాల విద్యార్థి



**జన్నారం, మార్చి 18 (ప్రభాత సమాచారం)**

2026-27 విద్యా సంవత్సరానికి నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో రాఘవేంద్ర లిటిల్ హన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ జన్నారం నుండి లకావతు రెడ్డి నాయక్ అనే విద్యార్థి ప్రతిభ కనబరిచి జవహర్ నవోదయ విద్యాలయం కాగజ్నగర్ కు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా రాఘవేంద్ర గ్రూప్స్ అధినేత ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాల స్థాపించినప్పటింది ఇప్పటివరకు సుమారు 18 మంది విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడం చాలా గర్వకారణమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, అకాడమిక్ డీన్ శ్రీ హేమలత షిండే, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.



## నార్నూర్‌లో గిరిజన సంస్కృతి

# కేంద్రాన్ని సందర్శించండి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పిలుపు - ఐటీడీఏ పీఓతో కలిసి 'ట్రైబల్ మ్యూజియం' ప్రారంభించిన కలెక్టర్**
**రూ.15 లక్షలతో సర్వాంగ సుందరంగా మ్యూజియం - నీతి ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్ నిధులతో నిర్మాణం**
**భారతీయ గిరిజన వారసత్వానికి అద్దం పట్టేలా ఏర్పాటు - అరుదైన కళాఖండాలు, పెయింటింగ్స్ ప్రదర్శన.**
**నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకే - సందర్శకులకు కేవలం 5 రూపాయలకే ప్రవేశం**
**9-14 ఏళ్ల బాలికలకు 'హెచ్‌పీవీ' వ్యాక్సినేషన్ ప్రారంభం - విద్యార్థులు గిరిజన చరిత్రను తెలుసుకోవాలి**







**నార్నూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
నార్నూర్ గిరిజన మ్యూజియాన్ని సందర్శించి గిరిజన వారసత్వాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం నార్నూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియంను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఐటిడిఎ పిఓ యువరాజ్ మర్మాట్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నీతి అయోగ్ నుండి అందిన డెల్టా ర్యాంకింగ్ గ్రాంట్ ద్వారా సుమారు 15 లక్షల రూపాయల వ్యయంతో గిరిజన మ్యూజియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడం జరిగిందని, ఈ మ్యూజియంలో భారత దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన తెగల సంస్కృతిని ప్రతిబింబించే బొమ్మలు, పెయింటింగ్స్, ఆదిలాబాద్ జిల్లా గిరిజనుల అరుదైన కళాఖండాలను ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. సందర్శకులకు గిరిజన సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు ప్రతి వస్తువు వద్ద సమాచార బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మ్యూజియం నిర్వహణ బాధ్యతలను స్థానిక మహిళా సంఘాలకు అప్పగించామని, ప్రవేశ రుసుముగా కేవలం 5 రూపాయలు మాత్రమే నిర్ణయించినట్లు వెల్లడించారు. సమీపంలోని లైబ్రరీ, ఎంఆర్ఓ, ఎంపిడిఓ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు ఈ మ్యూజియాన్ని సందర్శించి గిరిజన వారసత్వాన్ని తెలుసుకోవాలని ఆయన కోరారు. అనంతరం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో 9-14 సంవత్సరాల వయసుల బాలికలకు హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఐటిడిఎ పీఓ, కలెక్టర్‌లు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో గంగా సింగ్, నీతి అయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, ఈఈ తనాజీ, సర్పంచ్ కావేరి,వైద్యులు, వైద్య శాఖ సిబ్బంది, ఇతర అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా 'ఇఫ్తార్' విందు



**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో ఐక్యతకు ఇటువంటి వేడుకలు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి అనేక కార్యక్రమాలు చూసినా, ఇంత సక్రమంగా, క్రమశిక్షణతో కూడిన ఏర్పాట్లు చూడటం ఆనందంగా ఉందని అన్నారు. ఏ కార్యక్రమమైనా ఇలాంటి ఘనతతో నిర్వహిస్తేనే అది అందరికీ చిరస్మరణీయంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి గెట్-టు-గెదర్ కార్యక్రమాలు కేవలం విందు కోసం మాత్రమే కాకుండా, అధికారుల మధ్య, ప్రజల మధ్య ఉన్న దూరాలను తగ్గించడానికి వేదికలుగా ఉపయోగపడతాయని తెలిపారు. అధికారుల మధ్య సత్సంబంధాలు పెంపొందితే జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని చెప్పారు. రంజాన్ మాసం పవిత్రతను ప్రస్తావిస్తూ, ఇది ఆత్మశుద్ధి, నియమ నిష్ఠలకు ప్రతీక అని, నెల రోజుల పాటు పాటించే క్రమశిక్షణను జీవితాంతం కొనసాగించాలని సూచించారు. కుల, మత భేదాలు పక్కన పెట్టి, తోటి మనిషికి సహాయం చేయడం ప్రతి మతం చెప్పే ప్రధాన సందేశమని స్పష్టం చేశారు. జిల్లాలో బతుకమ్మ, రంజాన్, ఉగాది వంటి పండుగలను అన్ని వర్గాల ప్రజలు కలిసి జరుపుకోవడం మన సంస్కృతిలోని ఐక్యతకు నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు, జిల్లా ప్రజలకు ఉగాది ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టరేట్ మహిళా సిబ్బందికి పంచాయతీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో చీరలను కలెక్టర్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బాసర ట్రిపుల్ ఐటీలో

# విద్యార్థుల ఆందోళన

### వీసీ గెస్ట్‌హౌస్ ముందు రాత్రి నిద్ర

**ముథోల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ రెండో సంవత్సరం విద్యార్థిని మల్లిపూడి తేజస్విని మృతిపై తోటి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మంగళవారం రాత్రి వీసీ కార్యాలయాన్ని ముట్టడించారు. వీసీ రావాలంటూ ఆయన గెస్ట్‌హౌస్ వద్ద నినాదాలు చేశారు. రాత్రంతా గెస్ట్ హౌస్ గేటు ముందే నిద్రించారు. మృతురాలి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, క్యాంపస్‌లో వైద్య సదుపాయాలు, రోగ నిర్ధారణ పరికరాలను తక్షణమే అప్‌గ్రేడ్ చేయాలని.. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా సరైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తాము వీసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం లేదని.. జవాబుదారీతనం, విద్యార్థుల భద్రత కావాలని మాత్రమే అడుగుతున్నామని తెలిపారు. ట్రిపుల్ ఐటీ సీఎస్‌వో ఓఎస్డీ తమను వేధిస్తున్నారని పేర్కొన్నారు.

### యువతిని హత్య చేసిన యువకుడు అరెస్ట్



**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన సమ్మక్క హత్య కేసులో నిందితుడు కేర్కర్ జలపతిని పోలీసులు అరెస్ట్ చేశారు. జైహింద్‌పూర్‌కు చెందిన జలపతి (33) ప్రేమ పేరుతో సమ్మక్కను మోసం చేసి గర్భవతిని చేశాడు. పెళ్లి గురించి ప్రశ్నించగా, ఈ నెల 14న సాయంత్రం అడవి ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.



### రబింద్ర ప్లే స్కూల్లో ఉగాది వేడుకలు

**ముథోల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
ముథోల్‌లోని రబింద్ర ప్లే స్కూల్లో బుధవారం ముందస్తు ఉగాది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అసంవర్ సాయినాథ్ మాట్లాడుతూ, ఉగాది తెలుగువారి ముఖ్యమైన పండుగ అని, తెలుగు సంవత్సరం ఈ పండుగ నుంచే ప్రారంభమవుతుందని, సంస్కృతి, సంప్రదాయాలకు దేశం పుట్టినిల్లని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, భీమ్ రావు దేశాయ్, ప్లే స్కూల్ ఇంచార్జ్ హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



**తాండూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
శిక్షణ పొందిన వార్డు సభ్యులు (ఝుతీస ఎవఎ-ఎవతీం) శిక్షణను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధి దిశగా సమర్థంగా పనిచేయాలని బెల్లంపల్లి డీఎల్పీవో డీ సతీష్ కుమార్ (ఙ్రూా ఌఫ్అంష్ట్ర ఖబఝుతీ ) సూచించారు. మండలంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల కోసం కొత్తపల్లి రైతు వేదికలో 5 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని, గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్థులకు సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్స్, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి పరిక్ష తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పదవ తరగతి పరీక్షలను ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షల కొరకు 38 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని 6948 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు, త్రాగు నీరు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచమన్నారు. జిల్లాలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రతి పరీక్ష కేంద్రానికి సిట్టింగ్స్ స్క్వాడ్ బృందాలు, విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రశాంత వాతావరణం లో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



## బొంబాయిగూడలో పాఠశాలల్లో నీరు

**పెంచికల్‌పేట, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం బొంబాయిగూడ గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలు చెరువులను తలపిస్తున్నాయి. నిల్వ నీటితో విద్యార్థులు పాఠశాలకు వెళ్ళడం కష్టంగా మారింది. దోమలు పెరిగి చిన్నారులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు దెబ్బతిన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిల్వ నీటిని తొలగించి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


## కాగజ్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల కేంద్రం పునరుద్ధరణ



**కాగజ్‌నగర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో 20 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, మరమ్మత్తుల కేంద్రాన్ని చీఫ్ ఇంజనీర్ బి. అశోక్ పునరుద్ధరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్‌ఫార్మర్ల ప్రత్యేక నిర్వహణ చేపట్టి, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను సమయానికి మార్చి వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ జాడే ఉత్తమ్, డీఈ బి. వీరేశ్, సుధాకర్, దేవిదాసు, శ్రీనివాస్, ఇర్ఫాన్, సంతోష్, శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాలు వేయించాలి

**బేల, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ రామారావ్ అన్నారు. బుధవారం బేల మండల కేంద్రంలో చేపట్టిన ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ... రైతులకు ఆర్థికంగా నష్టం చేసే వ్యాధులలో ముఖ్యమైన వ్యాధి గాలికుంటు వ్యాధి అన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి,రైతులు పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



**బెజ్జూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో 10వ తరగతి విద్యార్థులకు మాజీ జెడ్పీటీసి పంద్రం పుష్పలత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాసి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆకలి దప్పికను తీర్చే ఉద్దేశంతో సేవా భావంతో విద్యార్థుల కోసం ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని సర్పంచ్ పద్మ, చిన్నయ్య, ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్ అన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవలో ఉండడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు మాజీ జెడ్పీటీసి పందరం పుష్పలతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుగుణ, లింగయ్య, లక్ష్మి, శంకర్ ఉన్నారు.

## కుమ్రంభీం జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం

**జొన్న పంటలకు భారీ నష్టం - నేల రాలిన మామిడి - ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు**



**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది. పలుచోట్ల కోత దశలో ఉన్న పంటలు నేలకొరిగి రైతుల ఆశలు నీరుగారాయి. ఆసిఫాబాద్ మండలం జనకాపూర్ శివారులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.స్థానిక రైతు బాబురావుతో పాటు మరో రైతు కలిసి మొత్తం 4 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. పంట కోత దశకు చేరుకున్న సమయంలో అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం వారి ఆశలను ఛిద్రము చేసింది. వర్షం తీవ్రతకు జొన్న పంట పూర్తిగా నేలకొరిగి భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులతో అప్పుల బారిన పడ్డ రైతులకు ఈ నష్టం మరింత భారంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో అనేక మంది రైతులు నష్టపోయినట్లు తెలుస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావంతో ఇటీవలి కాలంలో అకాల వర్షాలు తరచుగా కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోత దశలో ఉన్న పంటలకు ఈ వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## నేడు ఉగాది ఉత్సవాలు

**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం ఉగాది తెలంగాణ జానపద కళా జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. నిర్మల్ ప్రెస్ క్లబ్లో పొన్నం నారాయణ గౌడ్, డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ కే కిరణ్ కుమార్ తదితరు మాట్లాడుతూ 19 సంవత్సరాలుగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు నిర్మల్ పట్టణంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహించి ఈ ఉత్సవాలకు జబర్దస్త్ కళాకారులు సుధాకర్ వినోదిని ప్రవీణ్ హాజరవుతారు అన్నారు, ఉగాది పండుగ ప్రాధాన్యత, ఉగాది పచ్చడి పంచాంగ శ్రవణం సాంస్కృతిక కార్యక్రమాలు గోపూజ యజ్ఞం నిర్వహిస్తామన్నారు, తెలుగు సంవత్సరాది ఉగాది పండుగలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పొడెలి చిన్నయ్య ప్రధాన కార్యదర్శి గురుమూర్తి కమిటీ సభ్యులు వెన్నెల చిన్నయ్య నరసయ్య ఉన్నారు

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**కుభీర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో మెనూ ప్రకారం భోజనం అందించేలా చూడాలని కుభీర్ ఆశ్రమ పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి విజయ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలను విద్యార్థులకు కల్పించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని సూచించారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేల చూడాలన్నారు. ఆయన వెంట ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయురాలు తిరుమల ఉన్నారు.



# స్మశాన వాటికలో నీటి సౌకర్యం ఏర్పాటు



**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్మశాన వాటికల్లో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ నూతన పాలకవర్గం స్పందించింది. గత నాలుగు రోజుల క్రితం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి స్థానిక కౌన్సిలర్ లు, స్మశాన వాటిక కమిటీ సభ్యులతో కలిసి సందర్శిం చారు. కనీసం నీటి సౌకర్యాలు కూడా లేకుండా స్మశాన వాటిక నిర్వహణ కొనసాగడం ఆశ్చర్యానికి గురించేసింది. స్మశాన వాటికల్లో పారిశుద్యం, నీటి సౌకర్యం కొరకై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పారిశుధ్యం పనులు పూర్తి చేసి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు రోజుల్లో మంచిర్యాల చౌరస్తాలోని స్మశానవాటికలో నీటి సౌకర్యం కలిపించారు. నిర్మల్ మున్సిపల్ పరంగా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిచడం జరుగుతదని, అత్యవసరమైన సమస్యలపై వేగంగా చర్యలు తోసుకోవడం జరుగుతదని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పట్టణ ప్రజలకు వివరించారు.

## నిర్మల్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుమల మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తికి బుధవారం రాత్రి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు ఈ రాజేందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సన్మానం చేసి అభినందించారు. నిర్మల్ క్లబ్ అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఏజెన్సీ ప్రాంతాలకు నిధులు కేటాయించాలి



**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని సమస్యలపై గళం విప్పారు. 'అధ్యక్షా... అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడినా పట్టించుకోక పోతే ఎలా..? కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాల ప్రజల కష్టాలు ఎవరు తీరుస్తారు అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు'. నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, నిధుల కొరత, ప్రజలు పడుతున్న ఇబ్బందు లపై ప్రస్తావించారు. రోడ్లు, బ్రిడ్జిల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, గతంలో ఎస్టీ సబ్ ప్లాన్ కింద రోడ్ల నిర్మాణానికి నిధులు వచ్చేవని చెప్పారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదన్నారు. బిల్లులు రాక పోవడంతో నిధుల స్పష్టత లేక పోవడంతో కొత్త పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని వివరించారు. ఏజెన్సీ, గిరిజన గ్రామాల్లో సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా మంగి రోడ్, గుండాల రోడ్, మోడిగూడ వంటి ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని అత్యవసర సమ యాల్లో ఆసుపత్రికి వెళ్లడం ప్రాణసంకటంగా మారిందన్నారు. మంత్రులు పర్యటిస్తూ చూసి వెళ్తున్నారు తప్ప క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అలాగే సీడీపీ పనులపై ప్రస్తావించారు.

## అకాల వర్షం.. నేలరాలిన మామిడి



**చెన్నూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో బుధవారం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో అకాలవర్షం కురిసింది. చెన్నూరులో బుధవారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మామిడి కాయలు నేలరాయి. సంకారం, బుద్దారం, లంబడిపల్లి, కొమ్మెర, కిష్టంపేట, లింగంపల్లి తదితర గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలడంతో రైతులు నష్టపో యారు. ప్రతియేటా అకాల వర్షాలు, గాలిదుమారాలతో నష్టపోతున్నామని మామిడి రైతులు ఆందోళన చెందు తున్నారు. నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే చెన్నూరు పట్ట ణం, మండలంలో కురిసిన అకాల వర్షానికి మిర్చీ రైతులు ఇబ్బందులు పడ్డారు. మిర్చి పంటను కాపాడు కోవడానికి మిర్చి పంటపై టార్పాలిన్లు కప్పి ఉంచారు. నస్పూర్, జైపూర్‌లో బుధవారం తెల్లవారుజామున అకాలవర్షం కురిసింది. ఉరుములు మెరుపులు పిడుగులతో కూడిన భారీ వర్షం పడింది. వర్షం కారణంగా విద్యుతకు అంతరాయం ఏర్పడింది. బెల్లంపల్లి పట్టణంలో బుధవారం ఉదయం నుంచి వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబ డింది. ఉదయం వర్షం కురవడంతో పదోతరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై నీరు చేరడంతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడ్డారు. నెన్నెలలో మరో రెండురోజులు వర్షాలు కురిసే అవ కాశం ఉందనే వాతావరణ శాఖ సూచన మామిడి రైతులకు ఆందోళనకు గురిచేస్తోంది. ఈసారి సీజనలో ప్రతికూల వాతావరణంతో మామిడి పూత మాడి అంతంత మాత్రంగా పిందెలు కట్టాయి. ఆ పిందెలు కాస్తా గాలివానతో రాలిపో తున్నాయని రైతులు వాపో తున్నారు. మరోవైపు కూలీల కొరతతో పత్తి సేకరణ పూర్తికాలేదు. చెట్లపై ఉన్న పత్తి వర్షానికి తడిసింది. ఇప్పటికే పత్తి సేకరణ ఆలస్యం కాగా తడిసిన పత్తి ఆరే వరకు వేచి చూడాల్సి వస్తుందన్నారు.



## నేడు ఉగాది జానపద జాతర

**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని వెన్నెల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల పంపిణీ జానపద జాతర నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ధనరాజ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ముందు ప్రముఖ కళాకారులు యూట్యూబ్ ఇరువకుల ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఉగాది పండుగ ప్రాధాన్యతను ప్రజలకు తెలిపేందుకే వెన్నెల డాన్స్ అకాడమీ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భోజన్న కృష్ణ సురేష్ లక్ష్మి పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లకు మున్సిపల్ రెవెన్యూ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నిర్మల్ పట్టణంలో అధిక మొత్తంలో పెండింగ్ పన్నులు చెల్లించని వ్యాపార దుకాణాలు సముదాయాలు హాస్పిటల్ వెళ్లి పనులు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు. స్పందించని యాజమాన్యాలపై దుకాణాలను సీజ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్ ఇన్స్పెక్టర్ మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## సర్వే డబ్బులు చెల్లించాలి



**కడెం, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
సర్వే డబ్బులు చెల్లించాలి గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే 2024 డిసెంబర్‌లో జరిగిన సర్వేకు సంబంధించిన పారితోషికం ఎప్పటి వరకు చెల్లించలేదని వెంటనే చెల్లించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 33 జిల్లాల్లోని అన్ని జిల్లాల్లో చెల్లించారు. ఒక నిర్మల్ జిల్లాకే ఇంతవరకు ఏడాది ఒక సంవత్సరం గడిచిన కూడా డబ్బులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వము కలెక్టర్ గారి చెరువుతో వెంటనే డబ్బులు చెల్లించాలని లేకుంటే వచ్చే జనగణనను బహిష్కరించే ఆలోచనలో ఉన్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, జిల్లా నాయకులు లక్ష్మీ నరసయ్య, నాయకులు శ్రీనివాస్, ఎందరు నేత సుద్దాల రాజేశ్వర్ పాల్గొన్నారు.



## నవోదయకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎంపిక

**బోథ్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
సోనాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థిని భూర్తుల నిత్యశ్రీ మంగళవారం విడుదలైన నవోదయ విద్యాలయ ఫలితాలలో 6 వ తరగతి ప్రవేశ పరీక్షలో ఎంపిక అయిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు ఘనంగా సత్కరించారు ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గల ఏకైక పాఠశాల జవహర్ నవోదయ విద్యాలయం కాగజ్ నగర్ లో కలదని అందులో మన ప్రభుత్వ పాఠశాల నుండి విద్యార్థిని ఎంపిక కావడం గర్వకారణమని అదేవిధంగా కష్టపడి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని అన్నారు కార్యక్రమం లో ఉపాధ్యాయులు భారతి, విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, నర్మద, విద్యార్థులు ఉన్నారు.

### పేకాట స్థావరంపై దాడి..
## ఏడుగురు అరెస్ట్

**ముథోల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని బాగాపూర్ శివారులో గత కొద్ది కాలంగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం దాడి చేశారు. 7 గురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని వారి నుంచి రూ.14250 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే ఇద్దరు వ్యక్తులు పారిపోయారని వారిని కూడా త్వరలో అరెస్టు చేసి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే సహించేది లేదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



# పుస్తక పఠనంతోనే ఉజ్వల భవిష్యత్తు








**కేజీబీవీలో లైబ్రరీని ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా**
**ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్‌తో కలిసి**
**విద్యార్థులకు దిశానిర్దేశం**
**జ్ఞాన సముపార్జనలో పుస్తకాలే కీలకం**
**నార్నూర్ కస్తూరిబా పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు**
**బ్రెడ్ సొసైటీ ఎన్జీవో సహకారం**
**అందుబాటులోకి కథల పుస్తకాలు జీకే మెటీరియల్**

**నార్నూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం నార్నూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన లైబ్రరీని ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, లక్ష్య సాధనలో విద్యే కీలకమని అన్నారు. విద్యార్థులు గణితం, సైన్స్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని, అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్ కోసం ఇంగ్లీష్ భాషలో అనర్గళంగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాల కోసం కంప్యూటర్ పరిజ్ఞానం, పైథాన్, జావా వంటి ప్రోగ్రామింగ్ భాషల పట్ల అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తామని, కేజీబీవీలో ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెస్‌లో నాణ్యమైన ఆహారం అందించాలని, పౌష్టికాహార విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ.. బ్రెడ్ సొసైటీ ఎన్జీవో సహకారంతో విద్యార్థులకు కథల పుస్తకాలు, ఆత్మకథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. చదువులో ఎక్కడా విరామం రాకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో గంగా సింగ్, నీతి అయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, సర్పంచ్ కావేరీ, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నార్నూర్‌లో దాల్, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా





**నార్నూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** గ్రామీణ స్థాయిలో యూనిట్ల ఏర్పాటు వల్ల స్థానిక యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థికంగా వారు బలోపేతం అవుతారని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నార్నూర్ మండలంలోని తడిహత్నూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన సంపూర్ణ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా, స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాల్, మిల్లెట్ ఫ్లోర్ మిల్ యూనిట్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బైఫ్ స్వచ్ఛంద సంస్థ, ఎణఖీజ, ూాదీజ బ్యాంకుల సహకారంతో సుమారు 18 లక్షల రూపాయల వ్యయంతో ఈ చిన్నతరహా పరిశ్రమలను మహిళా సంఘాలు నెల కోల్పోయని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఇటువంటి యూనిట్ల ఏర్పాటు వల్ల స్థానిక యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ఆర్థికంగా వారు బలోపేతం అవుతారని ఆకాంక్షించారు. మహిళలు, రైతులు కలిసికట్టుగా ఇటువంటి వినూత్న యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని, మార్కెటింగ్ సౌకర్యాల కోసం డిఆర్డీఓ ద్వారా అవసరమైన మద్దతు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఈ-వెహికల్స్, సోలార్ ఇన్సెక్ట్ ట్రాపర్లు, డ్రిప్ ఇరిగేషన్ కిట్లు, కూరగాయల విత్తనాలను కలెక్టర్ పంపిణీ చేశారు. అలాగే, దాల్ ఫ్లోర్ మిల్ సభ్యులకు జిల్లా యంత్రాంగం తరపున 3 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో గంగా సింగ్, నీతి అయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, సర్పంచ్ దిలీప్ రాథోడ్, బైఫ్ ప్రతినిధి సాయి, ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సేంద్రీయ సాగుతో భూములు సారవంతం

**తాండూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** సేంద్రీయ పద్ధతిలో రైతులు వ్యవసాయం చేస్తే భూములు సారవంతంగా తయారవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఈ సురేఖ రైతులకు సూచించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా మండలంలోని గోపాల్ నగర్ గ్రామాన్ని కేంద్రం ఎంపిక చేసిందని అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ గాట్ల నర్సయ్య అధ్యక్షతన వ్యవసాయ అంశాలు, సేంద్రీయ సాగు పద్ధతుల గురించి రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ నేలలో సేంద్రీయ కర్బన శాతం తక్కువగా ఉందని, కంపోస్ట్ ఎరువులు తగ్గించి పశువుల ఎరువులు కచ్చితంగా వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే సుష్మ, ఏఈవో శంకర్, ఉప సర్పంచ్ గాజుల సునీత, కృషిఖీ, రైతులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

**దండేపల్లి, మార్చి 18 (ప్రభాత సమాచారం)** దండేపల్లి మండలం నంబాల గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి దాసరి శేఖర్(35) అనే రైతు మృతి చెందాడు. బుధవారం ఉదయం పొలానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఎస్సై తహసిద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చేతికందే దశలో ఉన్న పంటను చూసుకోవడానికి వెళ్లిన రైతు విగతజీవిగా మారడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకొన్నాయి.



## హోంగార్డు లక్ష్మి మృతికి ఎస్పీ అఖిల్ మహాజన్ సంతాపం

**అంతిమ యాత్రలో అండగా నిలిచిన జిల్లా పోలీస్ బాస్**



**ఆదిలాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖలో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హోంగార్డు లక్ష్మి బుధవారం ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్పందించి, స్థానిక రామ్‌నగర్‌లోని ఆమె నివాసానికి చేరుకున్నారు. లక్ష్మి పార్థివదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించిన ఎస్పీ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. "పోలీసు శాఖ ఒక కుటుంబం వంటిదని, లక్ష్మి మృతి తమకు తీరని లోటని" ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ. 10,000 తక్షణ ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా, జిల్లా పోలీసు వ్యవస్థ అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇన్చార్జ్ ఆర్ఐ ఎన్. చంద్రశేఖర్, వార్డ్ కౌన్సిలర్ చరణ్ గౌడ్, హోంగార్డు కార్యాలయ సిబ్బంది మరియు తోటి ఉద్యోగులు పాల్గొని నివాళులర్పించారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**జన్నారం, మార్చి 18 (ప్రభాత సమాచారం)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ధర్మారం ప్రైమరీ స్కూల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు జన్నారం మండలంలోని ధర్మారం ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదాల నివారణ మరియు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఒకవేళ జరిగితే ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బోర్ వేల్ ఏర్పాటు



**జైనూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)** జైనూరు మండల కేంద్రంలోని పవర్ హౌస్ కాలనీలో గత కొంతకాలంగా నీటి సమస్య నేల కోని ఉండగా స్థానికులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సర్పంచ్ కడప ప్రకాష్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు కాలనీలో బోర్ వేల్ వేయించారు. గ్రామ పంచాయతీ నిధులతో స్థానికుల నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్, పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొడప ప్రకాశ్, ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, పాలకవర్గ సభ్యులు షేక్ రహీం, షేక్ శఫీక్ అన్సారీ, మార్సుకోల దేవరావు, కొటేష్ తదితరులున్నారు.

# 99 రోజుల ప్రణాళిక లక్ష్యం నెరవేరాలి




**క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్ చంద్రయ్య తనిఖీ**
**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు కావాలి**
**మున్సిపల్ అధికారులకు ఆదేశం**
**వర్షం వల్ల నిలిచిన మురుగు, చెత్తను వెంటనే తొలగించాలని సూచన**
**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి**
**లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన అదనపు కలెక్టర్**

**మంచిర్యాల, మార్చి 18 (ప్రభాత సమాచారం)** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలో కొనసాగుతున్న కార్యక్రమం పురోగతిని మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఈ క్రమంలో ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించి శుభ్రత పనుల నిర్వహణ తీరుపై స్థానిక ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాల కారణంగా కాలువలు పొంగి పొర్లడంతో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఇంటి నిర్మాణంలో అవలంబించవలసిన నిబంధనలను లబ్ధిదారులకు వివరించాలని అధికారులను సూచించారు. అంగన్వాడీ, సీతారాం పల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థులకు అందిస్తున్న మెనూ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాస స్థితిగతులను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

# పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగవద్దు



**బెల్లంపల్లి, మార్చి 18 (ప్రభాత సమాచారం)** 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గల బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్యాంశాలలో వారి అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల కొరకు వేసవిలో సమ్మర్ క్యాంప్ లు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిబిరాలలో పాటలు, ముత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రామ్ నగర్ ప్రాంతంలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి వార్షిక పరీక్షల పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణ, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల



పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధులలో సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యాలయ టైపిస్ట్ ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడంపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారిని ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజన శాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలలోని భోజనశాల ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలించి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. ఆర్.ఓ. ప్లాంట్ ను పరిశీలించి విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా
## ఓటరు జాబితా సవరణ

**మంచిర్యాల, మార్చి 18 (ప్రభాత సమాచారం)** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో తహసిల్దార్లు, ఉప తహసిల్దార్ కు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండి అర్హత గల ప్రతి పౌరుడి వివరాలు ఓటరు జాబితాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, అనర్హులు, డూప్లికేట్ నమోదు, మరణించిన, చిరునామా మారిన వారి వివరాల తొలగింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ దిశగా జిల్లా అధికారులు అవసరమైన మార్గదర్శకాలను అందించాలని తెలిపారు. ఫారం-6 (కొత్త ఓటరు నమోదు), ఫారం-7 (పేరు తొలగింపు), ఫారం-8 (సవరణ/మార్పు) దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, అవసరమైన చోట ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వృద్ధులు, వికలాంగులు, బలహీన వర్గాలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట రీత్యా చర్యలు

**మంచిర్యాల, మార్చి 18 (ప్రభాత సమాచారం)** గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ లింగ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశానికి హాజరై జిల్లాలో పని చేస్తున్న స్కానింగ్ కేంద్రాలు, స్త్రీ వైద్య నిపుణుల దగ్గర ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. భేటీ బచావో బేటి



పడావో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఇందులో భాగంగా గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ల పర్యవేక్షణ, తనిఖీలు, రికార్డులు, సి సెక్షన్ ఆడిట్, తల్లులకు మహిళా సంఘాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చేయాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లో లింగ నిర్ధారణ పిసిపి యాంటీ యాక్ట్ పుస్తకము, స్కానింగ్ మిషన్ల వివరాలు ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రంలో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, స్కానింగ్ కు వచ్చే గర్భిణులకు సౌకర్యములు కల్పించాలని, లింగ నిర్ధారణ పైన అవగాహన కార్యక్రమాల గోడ ప్రతులను అతికించాలని, ఆసుపత్రి సర్టిఫికెట్లు, సేవల సంబంధిత రుసుముల వివరాలు గోడపై ప్రదర్శించాలని తెలిపారు. నూతన స్కానింగ్ మెషిన్ కొనడానికి ముందుగానే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని, పాత మిషన్ తీసివేయాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి సర్టిఫికెట్ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులందరూ సహకారం అందించాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలను సందర్శించి లోపాలు ఉన్న వారికి మెమోలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరములలో లింగ నిర్ధారణ పరీక్షల పైన అవగాహన కార్యక్రమాల సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు.

# పెళ్లి వేస్ట్.. లివింగ్ బెస్ట్



టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ చిత్రాల్లో తనదైన నటనతో మెప్పిస్తున్న యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తాజాగా పెళ్లిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గతేడాది 'థగ్ లైఫ్' వంటి భారీ చిత్రంలో నటించిన ఈ భామ, ప్రస్తుతం మెగా హీరో సాయి ధరమ్ తేజ్ సరసన 'సంబరాల ఏటిగట్టు' అనే పీరియడ్ డ్రామాలో నటిస్తోంది. ఈ క్రమంలో ఆమె వ్యక్తిగత జీవితం, వివాహం గురించి వస్తున్న వార్తలపై ఐశ్వర్య క్లారిటీ ఇచ్చారు. సాధారణంగా హీరోయిన్ల పెళ్లి గురించి రకరకాల పుకార్లు వస్తుంటాయి. అయితే ఐశ్వర్య లక్ష్మి మాత్రం ఈ విషయంలో చాలా భిన్నంగా స్పందించారు. తనకు పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశం లేదని ఆమె కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. "నాకు జీవితాంతం తోడుగా ఉండే భాగస్వామి కావాలి, అది నిజమే. కానీ పెళ్లి అనే బంధంలోకి వెళ్లాలని లేదు. ఇద్దరు వ్యక్తులు కలిసి జీవిస్తున్నప్పుడు ఒకరి వల్ల మరొకరికి ఇబ్బంది కలగకూడదు. అందుకే పెళ్లి చేసుకోకుండా కేవలం రిలేషన్‌షిప్‌లో ఉండటమే మేలు" అని ఆమె తన అభిప్రాయాన్ని పంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఐశ్వర్య చేసిన ఈ లివ్-ఇన్ రిలేషన్ వ్యాఖ్యలు విన్న నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. పెళ్లి అనే వ్యవస్థపై ఆమెకు ఉన్న అభిప్రాయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. సమాజం ఏమనుకుంటుందో అని ఆలోచించకుండా తన మనసులోని మాటను ధైర్యంగా చెప్పడం విశేషం. ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి తన కెరీర్‌పై పూర్తి దృష్టి పెట్టింది. రోహిత్ కెపి దర్శకత్వంలో వస్తున్న 'సంబరాల ఏటిగట్టు' సినిమా తన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆమె ఆశిస్తోంది.

## 'పెద్ది' సెట్స్‌లో తిలక్





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం నటిస్తున్న భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' . ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో టీమిండియా యువ క్రికెటర్, 2026 టీ20 వరల్డ్ కప్ విజేత తిలక్ వర్మ సందడి చేశారు. హైదరాబాద్‌లోని ఒక భారీ గ్రామీణ సెట్‌లో జరుగుతున్న చిత్రీకరణను తిలక్ వర్మ స్వయంగా వీక్షించి, చిత్ర బృందంతో కాసేపు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా తిలక్ వర్మకు రామ్ చరణ్ ఘనస్వాగతం పలికాడు.వరల్డ్ కప్ సాధించిన తర్వాత స్వరాష్ట్రానికి వచ్చిన తిలక్ వర్మను రామ్ చరణ్ ప్రత్యేకంగా అభినందించాడు. వీరిద్దరూ కలిసి సెట్స్‌లో దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న సినిమా కావడంతో, ఒక అసలైన క్రీడాకారుడు సెట్స్‌కు రావడం చిత్ర యూనిట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. రామ్ చరణ్ ఈ సినిమాలో ఒక రస్టిక్ లుక్‌లో కనిపిస్తున్న సంగతి తెలిసిందే.జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' వంటి పాటలు సోషల్ మీడియాలో రికార్డులు సృష్టిస్తున్నాయి. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి స్టార్స్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# అనుష్క హర్రర్ థ్రిల్లర్



మన టాలీవుడ్ క్వీన్ అనుష్క శెట్టి నుంచి గత ఏడాది ఘాటీ సినిమా వచ్చి ఆడియెన్స్ ని పలకరించింది. అయితే ఈ సినిమా అనుకున్న రేంజ్ సక్సెస్ సాధించలేదు. ఇక తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసమే అంతా ఎదురు చూస్తుండగా ఈసారి అనుష్క ఒక సాలిడ్ హారర్ థ్రిల్లర్ తో ఆడియెన్స్ ని పలకరించేందుకు సిద్ధం అయ్యింది. మరి ఆ చిత్రమే 'కథానార్'. దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి అవైటెడ్ టీజర్ గ్లింప్స్ పై ఇప్పుడు ఓ ఆసక్తికర పోస్టర్ తో అనుష్క అప్డేట్ ఇవ్వడం జరిగింది.ఈ సినిమా నుంచి ఈ మార్చ్ 31న మధ్యాహ్నం 1 గంట 31 నిమిషాలకి ఆ అప్డేట్ రివీల్ చేస్తున్నట్టు రివీల్ చేశారు. మరి ఈ పోస్టర్ చూస్తుంటే హారర్ ఎలిమెంట్స్ ని గట్టిగానే ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. సో ఇదెలా ఉంటుందో తెలియాలి అంటే ఈ నెలాఖరు వరకు ఆగాల్సిందే. ఇక ఈ చిత్రంలో జయసూర్య, ప్రభుదేవా తదితరులు నటిస్తుండగా శ్రీ గోకులం మూవీస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# కోలీవుడ్‌లో భాగ్యశ్రీ



గ్లామర్‌కు నటన జోడించి కుర్రకారుని విశేషంగా ఆకట్టుకుంటోంది కథానాయిక భాగ్యశ్రీ బోర్సే. త్వరలోనే తెలుగులో అఖిల్ సరసన 'లెనిన్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్న ఈ తార.. తాజాగా ఓ తమిళ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'సెయాన్'. 'తాయ్ కిళవి' ఫేమ్ శివకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్ నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ సినిమాలో నాయిక ఎవరన్నది చిత్రబృందం ప్రకటించలేదు. అయితే ఇప్పుడిందులో మెరిసే తారల ఎంపికలో భాగ్యశ్రీ బోర్సే పేరు పరిశీలనలో ఉందట. ఇప్పటికే ఈ సినిమా కోసం చిత్రబృందం ఆమెను సంప్రదించినట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని సన్నిహిత వర్గాల సమాచారం.



# లోకా: సమస్తా: సుఖినో భవన్తు !



**ఉగాది ప్రత్యేకం**

జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగుల్కొల్పి మానవాళిలో నూతనాశయాలను అంకురింపచేసే శుభదినం 'ఉగాది'. శిశిర ఋతువులో రాలిన ఆకులులా మనలో ఉన్న కామ, క్రోధాలని విడిచిపెట్టి, వసంతంలో మనలో మానవత్వం ఇంకా మిగిలే ఉందని. దేహీ! అన్నవారికి పిడికెడు అన్నం పెట్టాలని, దాహంతో ఉన్న వాళ్ళకి గుక్కెడు నీరు ఇవ్వాలని ఆకలితో ఉన్న పసిపిల్లలకు అక్కున చేర్చుకోవాలని, కులమతాలకు, అతీతంగా సాటి మనిషిని ఆదుకోవాలని మన తర్వాత తరం వారికి జ్ఞానాన్ని చిగురింపజేయాలి. అలాగే మన జీవితాలలో కూడా నూతనాశయాలు అంకురించాలనే సందేశం ఇవ్వాల్సిన రోజు ఇది. కొత్త ఆశలు, సంకల్పాలతో మొదలయ్యే రోజు. ఈ రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కనుక ఇది తెలుగువారి మొదటి పండుగ. సంప్రదాయాను సారంగా రైతులను గౌరవించే వేడుక ఈ పండగ. ఈ పండుగను తెలుగు సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకగా భావిస్తారు. ఉగాది తెలుగు వార్షిక పంచాంగ ప్రకారం కొత్త సంవత్సరాన్ని సూచించే ప్రముఖ పండుగ.

**యుగానికి ఆది**

ఉగాదిని యుగాది అని కూడా పిలుస్తారు. ఇది సంస్కృత పదాలు "యుగ" (యుగం), "ఆది" (ప్రారంభం) నుండి వచ్చింది. అంటే "కొత్త యుగం ప్రారంభం" అని అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయణాల ద్వయ సంయుతం యుగం కాగా ఆ యుగానికి ఆది యుగాదిగా మారింది అని చెప్తారు. వసంత ఋతువు ప్రారంభంలో వచ్చే ఈ ఉగాది పండుగ ప్రధానంగా ప్రకృతి పండుగ. శిశిరంలో ఆకులు రాలిపోయి మోడుగా మారిన చెట్లన్నీ వసంతం రాగానే కొత్త చిగుళ్లు తొడిగి ప్రపంచమంతా పచ్చగా మారి ప్రకృతి కాంత పరవశించే సమయంలో జరుపుకునే పండుగ ఈ ఉగాది. హిందూ పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు ఈ జగత్తును చైత్ర మాస శుక్ల పక్ష ప్రథమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా సృష్టించాడంటారు. తర్వాత ఆయన రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలను సృష్టించాడు. కనుక ఉగాది విశ్వ సృష్టికి మొదటి రోజు అని నమ్ముతారు. కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఈనాడు ప్రవర్తింప చేసాడన్నది పెద్దల భావన. ఈ విధంగా పురాణాలు ఉగాదిని కేవలం సంవత్సరాది పండుగగా కాకుండా, సృష్టి, కాలగణన, ధార్మికత, ప్రకృతి చక్రాలతో అత్యంత సన్నిహితంగా ఉన్న పవిత్ర దినంగా వర్ణిస్తున్నాయి. వేదాలను హరించిన సోమకుని వధించి మత్స్యవతారిదారియైన విష్ణువు వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభతరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణల ప్రతీతి. చైత్ర శుక్ల పాడ్యమి నాడు విశాల విశ్వాన్ని బ్రహ్మదేవుడు సృష్టించాడు. కనుక సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపుకుంటారని కూడా చెప్తారు. పురాణాలు ఈ రోజును కాలగణన ప్రారంభానికి సంకేతంగా పరిగణిస్తాయి. కృతయుగం ఉగాది రోజునే ప్రారంభమైందని నమ్మకం. రాముని పట్టాభిషేకం వసంత ఋతువులో జరిగిందని కొన్ని కథనాలు ఉన్నాయి. ఈ పట్టాభిషేకం కొత్త యుగం ప్రారంభానికి, ధర్మస్థాపనకు చిహ్నంగా పరిగణించబడుతుంది. శాలివాహన చక్రవర్తి చైత్ర శుక్లపాడ్యమినాడే పట్టాభిషిక్తుడై తన శౌర్య పరాక్రమాలతో శాలివాహన యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది



ఆచరింపబడుతుందని చారిత్రక వృత్తాంతం. 12వ శతాబ్దంలో భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు భాస్కరాచార్యుడు ఉగాదిని నూతన సంవత్సర ప్రారంభంగా గుర్తించాడు.

**నూతన పనులు**

ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించుట పరిపాటి. ఆ రోజున ప్రాతః కాలమున లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్ర పరచుకుంటారు. తలంటి స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దిన చర్య ప్రారంభిస్తారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంకరిస్తారు. పంచాంగ శ్రవణం జరుపుట ఆనవాయితీగా వస్తున్నది. ఆ సంవత్సరంలోని మంచి చెడులను, కందాయ ఫలాలను, ఆదాయ ఫలాయాలను, స్థూలంగా తమ భావి జీవిత క్రమం తెలుసుకుని దాని కనుగుణమైన నిర్ణయాలు తీసుకోవటానికి ఇష్టపడతారు. హిందూ గ్రంథాల ప్రకారం, విష్ణువును "యుగదికృతం" (యుగాల సృష్టికర్త) అని కూడా పిలుస్తారు. ఉగాది రోజున విష్ణుపూజ చేయడం వలన సకల పాపాలు పోతాయని పురాణ ప్రతీతి.

అంతే కాదు వసంత ఋతువు కూడా అప్పుడే మొదలవుతుంది. అందుకే కొత్త జీవితానికి నాందికి గుర్తుగా ఉగాది పండుగను జరుపుకుంటారు.

**ఋతువుల రాణి వసంతం**

వసంతం వచ్చింది, ప్రకృతి పచ్చదనంతో నవ్వుతోంది! ఉగాదితో వసంత ఋతువు ప్రారంభమవుతుంది. ఈ ఋతువు ప్రకృతి పునరుజ్జీవనాన్ని, కొత్త ప్రారంభాలను సూచించే ఋతువు. వసంత కాలం ప్రకృతిలో అనేక అందమైన మార్పులను తెస్తుంది. ప్రకృతికి కొత్త జీవితాన్ని తెస్తుంది. వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంటుంది. చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా ఉంటుంది. ప్రకృతి అత్యంత మనోహరంగా, రంగు రంగులతో ఉంటుంది. ఈ కాలం ప్రకృతికి ఒక నవ్యత్వాన్ని, తాజాదనాన్ని తెస్తుంది. ప్రకృతి అంతటా పచ్చదనంతో రంగురంగుల పూలతో వికసిస్తాయి. ఇది ప్రకృతికి అందమైన రూపాన్ని ఇస్తుంది. మందార, బంగారు పువ్వు, జాజి, చంపకం, నారింజ పూలు వంటి పువ్వులు వికసిస్తాయి. పచ్చని పొదల మధ్య నుంచి వెలువడే రంగురంగుల పుష్పాలు కళ్లకు విందు చేస్తాయి. ప్రకృతి సౌందర్యంగా ఉంటుంది. చెట్లు చిగురించడం, పూలు పూయడం, పరిసరాలు పచ్చగా మారడం ఈ ఋతువు ప్రత్యేకత. కొన్నిసార్లు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కూడా కురుస్తాయి. మామిడి చిగుళ్ళు, కోకిలల కూతలు వసంత ఋతువును మరింత ఆహ్లాదకరంగా చేస్తాయి. పక్షులు పాటలు పాడటం, గూళ్ళు కట్టుకోవడం, తేనెటీగలు, సీతాకోకచిలుకలు పువ్వుల పుప్పొడిని సేకరిస్తాయి. ఈ ఋతువును ' ఋతువుల రాణి ' గా పరిగణిస్తారు. వసంత ఋతువు ప్రకృతి, మానవ జీవితంలోని సృజనాత్మకత, ఆరోగ్యం, సంస్కృతికి సంబంధించిన అనేక అంశాలను కలిగి ఉంది. ఇది కొత్త ఆశలు, సంకల్పాలతో కూడిన ఋతువు. ప్రకృతికి, మానవునికి విడదీయరాని సంబంధం ఉన్నది. మానవుల మనుగడకు కావలసిన ప్రతిదీ ప్రకృతి నుంచే లభిస్తుంది. ఆహారం, నీరు, గాలి, నివాసం, ఇలా చెప్పుకుంటూ పోతే మన అవసరాలన్నీ ప్రకృతి నుంచే తీరుతాయి. ప్రకృతి మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సాహిత్యంపై ప్రభావం చూపుతుంది. పండుగలు, ఆచారాలు, కళారూపాలు ప్రకృతితో ముడిపడి ఉంటాయి. ప్రకృతి ఒడిలో ఉండటం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. అడవులు, పచ్చదనం ఒత్తిడిని తగ్గిస్తాయి, ఆనందాన్ని పెంచుతాయి. వ్యవసాయం, పర్యాటకం, పరిశ్రమలు వంటి ఆర్థిక కార్యకలాపాలకు ప్రకృతి ముడిసరుకును అందిస్తుంది. ప్రకృతిలో సమతుల్యత దెబ్బతింటే మానవుల మనుగడ ప్రమాదంలో పడుతుంది. పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు వంటివి మానవులకే కాకుండా అన్ని జీవులకు హాని చేస్తాయి. అందుకే ప్రకృతిని సంరక్షించడం మన బాధ్యత. ప్రకృతిని గౌరవిస్తూ, పర్యావరణాన్ని కాపాడుతూ, సహజీవనం సాగించడం అవసరం.

**పెద్దలు సందేశం ఇవ్వాలి**

ప్రస్తుత యువతకు పెద్దలు సందేశం ఇవ్వాలి. మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను గౌరవిస్తూ ఆధునిక సవాళ్లు, జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడంపై దృష్టి పెట్టేలా చూడాలి. తమ అనుభవాల నుంచి నేర్చుకున్న సత్యాలు, సంస్కృతి, కుటుంబ బంధాలు, నైతికత ప్రాముఖ్యతను యువతకు గుర్తు చేయాలి. ' శ్రమే జయం ' అని "ముందుకు సాగుతున్నప్పుడు మీ మూలాలను మర్చిపోకండి" అని చెప్పి తీరాలి. ఇంకా యువత స్వార్థం లేకుండా సమాజంలో సానుకూల మార్పుకు కృషి చేయాలని తెలపాలి. "విఫలమే విజయానికి మెట్టు" అనే దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, ప్రతి అడ్డంకిని అభివృద్ధికి అవకాశంగా చూడాలని సలహా ఇవ్వాలి. యువతకు "మీరు భవిష్యత్, కానీ, మీ చర్యలు శాశ్వత ప్రభావాన్ని కలిగిస్తాయి. జ్ఞానంతో, దయతో, ధైర్యంతో ముందుకు సాగండి." అని చెప్పాలి.

**యువతరం బాధ్యత**

కుటుంబ బంధాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పెద్దల అనుభవాలను గౌరవించాలి. విద్యను ఎప్పటికీ విస్మరించరాదు. నిరంతరం జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రయత్నించాలి. విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. పట్టుదలతో లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించాలి. వైఫల్యాలకు భయపడకూడదు. సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలి. పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలి. ఇతరులకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలి. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఈ ఉగాది నాడు మనమందరం ఆనందంగా ఉందాం. లోకాః సమస్తః సుఖినో భవన్తు !

## షడ్రుచుల సమ్మేళనం

ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైంది. షడ్రుచుల సమ్మేళనం. అవి తీపి (మధురం), పులుపు (ఆమ్లం), ఉప్పు (లవణం), కారం (కటు), చేదు (తిక్త), వగరు (కషాయం) అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగు వారికి ప్రత్యేకం. ఉగాది పచ్చడి అనేది ఉగాది పండుగ సందర్భంగా తెలుగు సంప్రదాయంలో తయారు చేసే ఒక ప్రత్యేకమైన వంటకం. ఇది కేవలం ఆహార పదార్థం మాత్రమే కాదు. జీవితంలోని వివిధ రుచులను, అనుభవాలను సూచించే ఒక సాంకేతిక వంటకంగా భావిస్తారు. ఈ పచ్చడిలో సాధారణంగా ఆరు రకాల రుచులు కలిసి ఉంటాయి. ఇవి జీవితంలోని సుఖదుఃఖాలను ప్రతిబింబిస్తాయి. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.



## కన్నపేగు కఠినత్వం

**కళ్ళు తెరవకముందే కాలగర్భంలోకి**
**రోడ్డు పక్కన అనాథగా పసిప్రాణం!**
**జాతీయ రహదారిపై పసికందు మృతదేహం లభ్యం**
**గుడిహత్నూరు సమీపంలో కలకలం**

**గుడిహత్నూర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలోని హైవే పై ఓ మగ పసి కందు మృతదేహం లభ్యమైన అమానుష ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల సమీపంలో జాతీయ రహదారి పక్కన పడి ఉన్న పసి కందు మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆ పసికందును అక్కడ ఎవరైనా కావాలనే వదిలేశారా..? లేదా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు.

## 'కేరళ స్టోరీ 2' సినిమా ఉచిత ప్రదర్శన



**కాగజ్‌నగర్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
హిందూ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని వెంకటరమణ థియేటర్‌లో ఈరోజు 'కేరళ స్టోరీ 2' సినిమా ఫస్ట్ షోను యువతులకు ఉచితంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా యువతులు, మహిళలు పెద్ద ఎత్తున థియేటర్‌కు తరలివచ్చారు. మూవీ చూడటానికి వచ్చిన వారికి కాషాయం కండువాలను నిరాల్వాహకులు అందజేశారు. థియేటర్ హౌస్‌ఫుల్ కావడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షుడు శివ గౌడ్ యువతిని ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు, అమ్మాయిలపై జరుగుతున్న అన్యాయాలను 'కేరళ స్టోరీ' సినిమాలో స్పష్టంగా చూపించారని, హిందూ అమ్మాయిలలో అవగాహన పెంచేందుకు సినిమాను ఉచితంగా ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

## సాక్షులను బెదిరిస్తే జైలు శిక్షే

**భార్యను చంపిన నిందితుడికి మూడేళ్ల శిక్ష!**

**ఆదిలాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
చట్టం ముందు ఎవరూ అతీతులు కారని, సాక్షులను భయపెట్టాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆదిలాబాద్ జిల్లా కోర్టు మరోసారి స్పష్టం చేసింది. తన భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్న జాడి రాధాకృష్ణ, బెయిల్‌పై బయటకు వచ్చి సాక్షులను బెదిరించినందుకు గాను అతనికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు తీర్పు వెలువరించారు. ఉట్నూర్ మండలం గంగన్నపేట గ్రామానికి చెందిన రాధాకృష్ణ, తన భార్యను హత్య చేసిన కేసులో నిందితుడు. గతేడాది సెప్టెంబర్‌లో బెయిల్‌పై వచ్చిన అతను, తన అత్తగారి ఇంటికి వెళ్లి సామాన్లు చిందరవందర చేసి.. తనపై ఉన్న కేసును వెనక్కి తీసుకోవాలని, లేదంటే చంపేస్తానని మామ సంజీవ్‌ను బెదిరించాడు. కోర్టులో సాక్ష్యం చెబితే ప్రాణాలు తీస్తానంటూ హెచ్చరించాడు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహీం పటిష్టమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి, నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు.

# బాసర ట్రిపుల్ ఐటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలి

**అసెంబ్లీలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ - విద్యార్థిని మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణం**



**ముథోల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
2014వ సంవత్సరం నుండి బాసర ట్రిపుల్ ఐటీ లో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన త్రిబుల్ ఐటీ సమస్యలపై మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ట్రిపుల్ ఐటీ విద్యార్థి తేజస్విని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ ఘటన జరిగిందన్నారు. సరైన వైద్య సేవలు అందకపోవడం మూలంగానే ఒక నిండు ప్రాణం బలైంది అన్నారు. ట్రిపుల్ ఐటీ లో సమస్యలు రాజ్యమేలుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత ఆరు సంవత్సరాల క్రితం అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ కొన్ని కంప్యూటర్లు మాత్రమే ఇచ్చారని, విద్యార్థులకు కంప్యూటర్లు, ల్యాప్టాప్‌లు లేకపోవడం వలన విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోతున్నారన్నారు. పేర్లు మార్చి అదే మెస్ కాంట్రాక్టర్లు సంవత్సరాల తరబడి ఉంటున్నారని, నామినేషన్ పద్ధతిని తొలగించి టెండర్లు వేయాలన్నారు. ట్రిపుల్ ఐటీ పర్యవేక్షణకు పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, విద్యావంతులతో కూడిన ఒక కమిటీని వెయ్యాలన్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నియామకాల ప్రక్రియ పారదర్శకంగా లేదని, సమస్యలు అడిగితే పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని అధికారులు విద్యార్థులను బెదిరిస్తున్నారని అన్నారు అక్కడ ఉన్న బేకరీ యజమాని ఇష్టనుసారం గా వ్యవహారిస్తూ అధిక ధరలకు అమ్మి విద్యార్థులను నిలువుగా దోచుకుంటున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.

**28 ప్యాకేజీ కి నిధులు ఇవ్వండి...**
ప్రాణహిత చేవళ్ల 28 ప్యాకేజీ పనులు పూర్తిఅయితే ముథోల్ నియోజకవర్గం లో 50 వేల ఎకరాల కు సాగు నీరు అందుతుందని నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అసెంబ్లీ లో కోరారు. కేవలం ఎకరానికి 75 వేలు మాత్రమే సాగునీటికి ఖర్చు అవుతున్నాయని తక్షణమే నిధులు ఇస్తే మా నియోజకవర్గం సస్యశామలం అవుతుందన్నారు. గత ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా 28 ప్యాకేజీ పూర్తి కాలేదని ఇప్పటి ప్రభుత్వం అయినా దృష్టి సారించాలని కోరారు.

**కరెంటు సమస్య తీర్చండి...**
నియోజకవర్గం లో మొక్క జొన్న, వరి పంటలు అధికంగా సాగుచేస్తారని, ప్రస్తుతం విద్యుత్ సరఫరా లో అంతరాయం తో పంటలకు రైతులు నీరు అందించలేక పోతున్నారని, సమస్యను తీర్చాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరారు.

## హోటళ్ళు, రెస్టారెంట్లపై టాస్క్ ఫోర్స్ దాడులు

**బెల్లంపల్లి, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో టాస్క్ ఫోర్స్ సివిల్ సప్లై అధికారులు దాడులు కలకలం సృష్టించాయి. బుధవారం బెల్లంపల్లిలో పలు దుకాణాలపై ఆకస్మికంగా దాడులు చేశారు. హైదరాబాదు నుంచి వచ్చిన ఎన్ ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు వంటగ్యాస్ నిబంధనల దుర్వినియోగంపై తనిఖీలు చేశారు. పట్టణంలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు తదితర వ్యాపార దుకాణాలల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కమర్షియల్ వంట గ్యాస్ కు బదులు గృహ అవసరాలకు వినియోగించే పంట గ్యాస్




సిలిండర్ల వినియోగం లక్ష్యంగా సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 16 సిలిండలను స్వాధీన చేసుకొని సీజ్ చేశారు.

## ఉద్యోగం పేరుతో మోసం.. నిందితుడికి రిమాండ్

**ఇచ్చోడ, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, ఒక యువతి వద్ద రూ. 20 వేలు వసూలు చేసి మోసం చేసిన దుర్వా పరమేశ్వర్ రావు అనే వ్యక్తిని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేశారు. చించోలి గ్రామానికి చెందిన బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు.

## అకాల వర్షం.. దెబ్బతిన్న పంటలు



**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం కురిసన వర్షానికి పంటలు తడిసిపోయాయి. ఆసిఫాబాద్ మండలంలో బుధవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఈదురుగాలుల బీభత్సానికి మండలంలోని రైతులు సాగు చేస్తున్న జొన్న పంట పూర్తిగా నేల వాలింది. కోత దశలో ఉన్న పంట అకాల వర్షంతో నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. బెజ్జూరు మండలంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, కంది, పెసర పంటలకు తీవ్ర నష్టం సంభవించింది. ఇప్పటికే పత్తి ఆలస్యంగా చేతికి రావడంతో ఇంకా చేలలోనే తీయకుండా ఉంది. కురిసిన ఈదురుగాలులు భారీ వర్షానికి పత్తిపంటకు తీరని నష్టాన్ని కలిగిచింది. అదే విధంగా పంట చేలనులలో కోసి ఉంచిన కంది, పెసర పంటలు కూడా వర్షానికి తడిచి పోవడంతో మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెంచికలపేట మండలంలో బుధవారం ఉదయం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. మండలంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, మిరప, కంది పంటలకు తీవ్ర నష్టం సంభవించింది. ఇప్పటికే పత్తి ఆలస్యంగా చేతికి రావడంతో ఇంకా చేలలోనే తీయకుండా ఉంది. కురిసిన ఈదురుగా లులు భారీ వర్షానికి పత్తిపంటకు తీరని నష్టాన్ని కలిగిచింది. ఏరివేత పూర్తైన పత్తి కుప్పలు తడిసి సోయాయి. పంట చేల్లో ఆరబెట్టిన కంది, పెసర పంటలు కూడా వర్షానికి తడిచి పోవడంతో మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చింతలమానేపల్లి మండలంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, మిరప, కంది పంటలకు తీవ్ర నష్టం సంభవించింది. ఇప్పటికే పత్తి ఆలస్యంగా చేతికి రావడంతో ఇంకా చేలలోనే తీయకుండా ఉంది. కురిసిన ఈదురుగాలులు భారీ వర్షానికి పత్తిపంటకు తీరని నష్టాన్ని కలిగిచింది. ఆరబెట్టిన పత్తి కుప్పలు తడిసి పోయాయి. ఈదురుగాఉలలు భారీ వర్షానికి పత్తి, మిరప పంటలకు తీరని నష్టాన్ని కలిగించింది. దహెగాం, మండలంలో కురిసిన వర్షానికి చేతికి అందివచ్చిన పంటలు పత్తి, పెసర, కంది, మిర్చి తడిసి ముద్ద అయ్యాయి. ఈదురుగాలుల వర్షానికి పంటలు తడిసి రాలిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సిర్పూర్(టి) మండల వ్యాప్తంగా అకాల వర్షం, ఈదురుగాలులతో మామిడి రైతులకు నష్టం వాట్లింది. పింద దశలో ఉన్న మామిడి కాయలు ఈదురుగాలుల తీవ్రతకు రాలిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పత్తి తడిసి ముద్దయిందని రైతులు తెలిపారు.



## యువతిని హత్య చేసిన నిందితుడిని శిక్షించాలి

**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీ యువతిని మోసం చేసి.. హత్య చేసిన నిందితుడిని కఠిన శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కూషన రాజన్న డిమాండ్ చేశారు. పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామంలోని బాధిత కుటుంబాన్ని బుధవారం సీపీఎం జిల్లా నాయకులు ఆనంద్ కుమార్, అశోక్, శ్రీనివాస్ పరామర్శించారు. జిల్లాలో ఈ మధ్య కాలంలో ఆదివాసీ మహిళలపై దాడులు పెరిగాయని.. దీనికి ప్రధాన కారణం గతంలో నేరాలు చేసిన వారిని కఠినంగా శిక్షించకపోవడమే అన్నారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం స్పందించి ఆదివాసీ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసి.. ఏడు నెలల గర్భవతి అని చూడకుండా దారుణంగా హత్య చేసిన నిందితుడు జలపతిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారంతో పాటు 5 ఎకరాల భూమి ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. కలెక్టర్, ఎస్పీ వెంటనే గ్రామాన్ని సందర్శించాలని వారు డిమాండ్ చేశారు.

## కామన్‌పల్లిలో వీధి దీపాల ఏర్పాటు

**జన్నారం, మార్చి 18 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని కామన్ పల్లి గ్రామపంచాయతీలో గ్రామ ప్రజల సౌకర్యార్థం,చీకటి పడితే నడవడానికి ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలను తీరుస్తూ కామన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు నూతనంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ శ్రీనివాస్ ఉపసర్పంచ్ తేజావత్ భరత్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గత కొంతకాలంగా గ్రామంలోని పలు వీధుల్లో సరైన వెలుతురు లేక రాత్రి వేళల్లో ప్రజలు,ముఖ్యంగా వృద్ధులు మరియు మహిళలు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు స్పందించిన సర్పంచ్ మరియు ఉపసర్పంచ్,స్వయంగా దగ్గరుండి వీధి దీపాల అమరికను పర్యవేక్షించారు. చీకటి కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి,నాణ్యమైన వీధి దీపాలను ఏర్పాటు చేయించాం అని సర్పంచ్ పేరం శ్రీనివాస్,ఉపసర్పంచ్ తేజావత్ భరత్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇస్లావత్ కరుణ పాల్గొన్నారు.



# పీఎంశ్రీ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**ఆసిఫాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**

ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలను ఆదర్శంగా తీర్చి దిద్దాలని కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్, ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలల కేంద్ర నోడల్ అధికారి అమిత్ కటోచ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ కె హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాకులు సత్యనారాయణ రెడ్డి, జిల్లా విద్యాధికారిణి లలితతో కలిసి ఎంఈవో, ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో 18 ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలల్లో మ్యాథ్స్, సైన్స్ సర్కిల్ పెంచాలని, విద్యార్థులను క్షేత్రస్థాయి సంఘర్షణలకు తీసుకెళ్లాలని, విద్యార్థులకు ఎకో క్లబ్, నృత్యాలు, సంగీతం పరికరాల వినియోగం, అటల్ టెంకరింగ్ ల్యాబ్, ఒకేషనల్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ ఎడ్యుకేషన్ నేర్పించాలని తెలిపారు. ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు, అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. కలెక్టర్ కెహరిత మాట్లాడుతూ జిల్లాలో 18 ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మౌలిక వసతులు, అదనపు గదుల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని, కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలలో చేపట్టే కార్యక్మరమాలను అధికారుల సమన్వయంతో అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త సతీష్, దేవాజీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కెరమెరి మండలం సావర్ఖేడ ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం పీఎం శ్రీ కేంద్ర పరిశీలకులు అమిత్ కటోచ్ పరిశీలించారు. ప్రైమరీ తరగతుల గదులను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాదానాలు రాబట్టారు. 4, 5వ తరగతి విద్యార్థులచే కలిసి పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థుల సౌకర్యాలను అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వంట గది, కిచెన్ గార్డెన్, హెర్బల్ గార్డెన్, క్రీడా పరిసరాలు పరిశీలించారు. పాఠశాలకు గ్రామస్తుల సహకారాన్ని అభినందించారు. ఆయన వెంట ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో లలిత, ఎంఈవో ప్రకాష్ ఉన్నారు.

# చిత్తడి నేలలతో పర్యావరణ ప్రయోజనాలు



## చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**

చిత్తడి నేలలతో (వెట్ ల్యాండ్స్) అనేక పర్యావరణ ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లాలో చిత్తడి నేలల గుర్తింపుకు సంబంధించి, సంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో బుధవారం సాయంత్రం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న చిత్తడి నేలలను శాస్త్రీయంగా గుర్తించి, వాటిని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో భాగంగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించాలని సూచించారు. చిత్తడి నేలల వల్ల భూగర్భ జలమట్టం పెరగడమే కాకుండా, జీవవైవిధ్యం పెంపొందుతుందని, వీటిని గుర్తించి, కాపాడుకోవడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలను కేవలం పర్యావరణ కోణంలోనే కాకుండా, పర్యాటక కేంద్రాలుగా కూడా తీర్చిదిద్దే అవకాశం ఉందని, తద్వారా జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, అటవీ శాఖాధికారి (డిఎఫ్ఓ) సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో రత్నకళ్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నవోదయలో కుంటాల

# విద్యార్థి 'సహర్ష్' సంచలనం

**ఉమ్మడి జిల్లాలోనే టాపర్‌గా రికార్డు!**

**6 తరగతి ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ**

**4,478 మందిలో ప్రథమ స్థానం**

**జవహర్ నవోదయలో సీటు సాధించిన ఓడ్నం సహర్ష్**

**సృజన స్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల శుభాకాంక్షల వెల్లువ**

**కష్టపడి చదివితే ఫలితం దక్కుతుందని నిరూపించిన కుర్రాడు**

**ముథోల్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కుంటాల మండలానికి చెందిన ఓడ్నం సహర్ష్ అరుదైన ఘనత సాధించారు. జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఆయన ఉమ్మడి జిల్లాలోనే టాపర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. గత డిసెంబర్ 13న నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,478 మంది విద్యార్థులు హాజరయ్యారు. అత్యంత కఠినమైన ఈ పోటీలో కేవలం 80 మంది మాత్రమే ఎంపిక కాగా, అందులో సహర్ష్ అగ్రస్థానంలో నిలవడం విశేషం. సహర్ష్ సాధించిన ఈ అద్భుత విజయంపై కుంటాల మండలంలో సంబరాలు మిన్నంటాయి. విద్యార్థి చదువుతున్న సృజన స్కూల్ ప్రిన్సిపాల్ గంగన్న, ఉపాధ్యాయ బృందం ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. తమ కుమారుడు జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలవడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించవచ్చని సహర్ష్ నిరూపించాడని పలువురు కొనియాడారు.

# పిల్లలందరూ కోలుకుంటున్నారు

**వాంకిడి, మార్చి 18 (ప్రభాత సమాచారం)**

ఫుడ్ పాయిజన్‌కు గురైన పిల్లలందరూ కోలుకుంటున్నారని డీఎంహెచ్ఓ సీతారాం అన్నారు. బుధవారం వాంకిడి ఆసుపత్రిని ఆయన సందర్శించి చికిత్స పొందుతున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న వైద్యసేవలపై స్థానిక వైద్య సిబ్బందిని ఆరా తీశారు. మంగళవారం రాత్రి నార్ల పూర్ గ్రామంలో పోచమ్మ విందులో బల్లిపడిన ఆహారం తిని 15 మందికి ఫుల్ పాయిజన్ అయింది. ప్రస్తుతం ఎవరికి ఎలాంటి ప్రమాదం లేదు. సాయంత్రం వరకు అందరూ కోరుకుంటారని చెప్పారు. అనంతరం శివాలయం సమీపంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు సరైన సమయంలో యుఐపీ టీకాలు వేయాలని సూచించారు. డీఎంహెచ్ఓ వెంట వైద్యాధికారి వినయ్ సిబ్బంది ఉన్నారు.



# ప్రజల జీవితాల్లో ఉగాది వెలుగులు నిండాలి

**మంత్రి జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు**

**'శ్రీ పరాభవ' నామ సంవత్సర శుభాకాంక్షలు**

**ఆదిలాబాద్, మార్చి 18 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'శ్రీ పరాభవ' నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది మన వారసత్వపు పండుగ అని అభివర్ణించారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళలు... జాతిని సజీవంగా నిలుపుతాయని తెలిపారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని మంత్రి ఆకాంక్షించారు. సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పండగ అన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో.. ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. జీవితం కష్టసుఖాల సమ్మేళనం, ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు. శ్రీపరాభవ నామ సంవత్సరంలో దేశం అభివృద్ధి సాధించాలన్నారు.

విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక

9440977660, 9110718194

PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY